క్లుప్తంగా

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణమూర్తి

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యదేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

బిక్కవోలు: మండలంలోని మొక్లారు విశ్వేశ్వర స్వామి శివాలయం వద్ద ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

ఘనంగా మదర్స్ డే

పెదపూడి: మండలంలోని పెదపూడి, జి.మామిడాడ, ఏపీత్రయం, కాండ్రేగుల, పెద్దాడ, శహపురం, సంపర, పైన, రాజుపాలెం గ్రామాల్లో మదర్స్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతృమూర్తులకు కుమారులు, కుమార్తెలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి వారి కుటుంబాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.

వైభవంగా గుబ్బాలమ్మ తల్లి జాతర

రంగంపేట: మండలంలోని సింగంపల్లిలో కొలువైయున్న గుబ్బాలమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, మిరుమిట్లు గొలిపే బాణసంచా అందరినీ అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎస్ఐ రామకృష్ణ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పర్యావరణ హితంగా జీవన శైలి

రాజానగరం: పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా జీవన శైలిని అలవర్చుకోవాలని అటవీ శాఖ డీఆర్వో పద్మావతి అన్నారు. మండలంలోని పాతతుంగపాడు, తోకాడలలో సర్పంచ్‌లు ఎలుగుబంటి రాంబాబు, వేగిశెట్టి వీవీ చక్రధరరావు అధ్యక్షతన ఆదివారం మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించారు. నీటిని పొదుపుగా వాడడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అటవీ బీట్ అధికారి జీవీ రంగారావు, సహాయ అధికారి శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్తకు రిమాండ్

సీతానగరం: మండలంలోని చీపురపల్లికి చెందిన పెద్దే నాగమణపై కత్తితో దాడి చేసిన భర్త అర్జున్‌కు కోర్టు రిమాండ్ విధించిందని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు ఆదివారం తెలిపారు. నాగమణిపై శనివారం కత్తితో దాడి చేసి మెడ, నడుము, కుడి చేతిపై నరికాడని, వీరి ఇద్దరి మధ్య కోర్టులో కేసు నడుస్తుందన్నారు. నిందితుడిని అతడి ఇంటి వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు.

కోరుకొండకు భక్తుల రద్దీ

మధురపూడి: కోరుకొండలో కొలువుదీరిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తుల రద్దీ ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. దేవాలయ సిబ్బంది తాటాకులతో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతో భక్తులు సేద తీరారు. అలాగే దేవస్థానం నిర్వహిస్తున్న అన్నసమారాధనలో 500 మంది భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

మధురపూడి: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేయడంతో కోరుకొండలో ఆదివారం ఆ పార్టీ నాయకులు విజయోత్సవం నిర్వహించారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోడదాసి మార్టిన్ లూథర్ మాట్లాడుతూ బడుగుల జీవితాల్లో కాంగ్రెస్ పార్టీ వెలుగులు నింపుతోందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడియార్ కర్రి గణేష్, గరగ శ్రీధర్ పాల్గొన్నారు.

శిక్షణతో విజ్ఞాన ప్రాప్తిరస్తు

- గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా తరలివస్తున్న విద్యార్థులు



గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

రంగంపేట: గ్రంథాలయాలు రారమ్మని పిలుస్తున్నాయి. ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విజ్ఞానాన్ని అందిస్తున్నాయి. సెలవులను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేందుకు ఈ శిబిరాలు దోహదపడుతున్నాయి. పుస్తక పఠనంపై ఆసక్తి కల్పించేందుకు స్థానిక శాఖా గ్రంథాలయంలో మే నెల 8వ తేదీన ప్రారంభమైన శిబిరాలు జూన్ 11 వరకూ కొనసాగనున్నాయి. రోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. విజ్ఞానం, వినోదం, సాహిత్యం, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, ఆంగ్ల భాష, భావ వ్యక్తీకరణ తదితర అంశాల్లో పట్టు సాధించేలా తీర్చిదిద్దుతున్నారు. పిల్లలకు ఆసక్తి కలిగించే పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. బాల సాహిత్యం, దేశ నాయకుల జీవిత చరిత్రలు, దేశభక్తి పెంపొందించే పుస్తకాలు చదవడానికి ప్రాధాన్యమిస్తున్నారు. శిబిరానికి రాగానే నచ్చిన పుస్తకాన్ని చదివిన తరువాత మిగిలిన తరగతులు ప్రారంభిస్తున్నారు. స్టోరీ టెల్లింగ్(ఆకట్టుకునేలా కథలు చెప్పడం), నీతి కథలు, మానవీయ ప్రవర్తన, ఎదుట వ్యక్తిని ఆకట్టుకునేలా కథలు చెప్పడం తదితర అంశాల్లో తర్ఫీదునిస్తున్నారు. రోజుకో అంశంలో చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, పాటలు పాడటం, నృత్యం తదితర విభాగాల్లో నిపుణులు, విశ్రాంత ఉపాధ్యాయులతో తరగతులు చెప్పిస్తున్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి కలిగిస్తున్నాం



వేసవి శిక్షణ శిబిరానికి నిపుణులు, ఉపాధ్యాయులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి స్పెషల్ క్లాసులు చెబుతున్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగిస్తున్నాం. కొత్త విషయాలను పిల్లలకు నేర్పిస్తున్నాం. చదువుకు ప్రాధాన్యమివ్వడం ద్వారా భవిష్యత్‌లో కలిగే ప్రయోజనాలు వివరించి చెబుతున్నాం.

– ఎస్.రామకోటేశ్వరరావు, గ్రంథాలయాధికారి, రంగంపేట

చిత్రలేఖనంపై ఆసక్తితో వెళుతున్నా



చిత్రలేఖనంపై ఆసక్తితో వేసవి శిక్షణకు వెళుతున్నాను. వివిధ రకాలు బొమ్మలు వేయడం నేర్చుకుంటున్నాను. పేపరుతో పలు రకాల ఆకృతులు తయారు చేయిస్తున్నారు. ఇవి భవిష్యత్‌లో మాకు ఎంతో ఉపయోగపడతాయి.

– కె.శ్యామ్‌కుమార్, 8వ తరగతి, రంగంపేట

కథలంటే ఇష్టం



నాకు కథలంటే చాలా ఇష్టం. శిబిరంలో ఎంతో ఆసక్తి గల కథలు చెప్పడమే కాకుండా కాగితం బొమ్మలు చేయడం నేర్పిస్తున్నారు. సులభంగా బొమ్మలు ఎలా గీయాలో తర్ఫీదునిస్తున్నారు. ఇలాంటి మెళకువలు తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– సీహెచ్ సమన్విత , 6వ తరగతి, రంగంపేట

పలు అంశాల్లో పట్టు



నేను మా స్నేహితులతో కలిసి డ్రాయింగ్, ఇంగ్లిష్ నేర్చుకుంటున్నాను. వేసవి సెలవులను బాగా ఎంజాయ్ చేస్తున్నాను. శిక్షణ శిబిరాల వల్ల పలు అంశాలల్లో బాగా పట్టు సాధిస్తున్నాం.

– వనుము నాగ రేవతి, 6వ తరగతి, రంగంపేట

టీడీపీకి సీనియర్ నేత విజయ్ రాజీనామా



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దొడ్డా విజయ్

గోకవరం: గోకవరం మండలం రంపయర్రంపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు, పార్టీ కాకినాడ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దొడ్డా విజయ్ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. గోకవరం ప్రెస్‌క్లబ్ భవనంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1994 నుంచి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేశానన్నారు. అయినా సరిగా గుర్తించడం లేదని అన్నారు. ఈ పరిస్థితులపై మనస్థాపం చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నానన్నారు. తన నిర్ణయాన్ని జిల్లా, రాష్ట్ర కమిటీకి తెలియజేస్తానన్నారు.

ప్రతిభను వెలికి తీయడానికే క్రీడాపోటీలు

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- లంకూరు మెగా క్రికెట్ టోర్నీ ప్రారంభం



మట్ట శివాజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: యువతలో దాగిన ప్రతిభను వెలికి తీయడానికి క్రీడాపోటీలు ఎంతో ఉపయోగపడతాయని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మట్ట శివాజీ జ్ఞాపకార్థం ఆదివారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన లంకూరు మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ముందుగా మట్ట శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ 2009 నుంచి నిర్విరామంగా లంకూరు మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. నేటి పదో సీజన్‌లో 32 టీమ్‌లు పాల్గొంటున్నాయన్నారు. ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని, అందరూ స్నేహపూర్వక వాతావరణంతో మెలగాలని సూచించారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న టోర్నమెంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుద్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రాజానగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993 – 98లో చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తాము చదువుకున్న పాఠశాలలో సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. తమ గురువు పీవీవీ సుబ్రహ్మణ్వేశ్వర్రావు దంపతులకు గురుపూజ చేసి, గురుభక్తిని చాటుకున్నారు. కుటుంబ సభ్యులకు తమ చిన్ననాటి స్నేహితులను పరిచయం చేశారు.

విద్యా ప్రదాతల సేవలు మహోన్నతం

కడియం: విద్యా ప్రదాతల సేవలు మహోన్నతమని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళాసేవాసమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గౌరవ అధ్యక్షుడు అడపా సుబ్రహ్మణ్యం, చిలుకూరి శ్రీనివాసరావు, తోరాటి వసంతరావు అన్నారు. కడియం శాఖా గ్రంథాలయం, చెళ్లపిళ్ల సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ అధికారి శెట్టిపల్లి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన వేసవి శిబిరంలో ఆదివారం పలువురు ప్రముఖులను సత్కరించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కడియం మండలాన్ని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపిన ఎంఈఓ వి.లజపతిరాయ్, కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం కోసం స్థలాన్ని సమకూర్చి, వేలమంది విద్యావంతులు కావడానికి సహకరించిన బొమ్మిరెడ్డి వంశీయులు బొమ్మిరెడ్డి చక్రధరరావుకు, రైతుసంఘం అధ్యక్షుడిగా దశాబ్దం పాటు కడియం ఆవ సమస్యలు తీర్చిన చిక్కాల ఈశ్వరరావు, ఆధ్యాత్మికంగా సేవలో ముందున్న రైతు నాయకుడు ఉప్పులూరి చిట్టియ్యను ఘనంగా సన్మానించి, వారి సేవలను ప్రశంసించారు. పాఠశాలకు స్థలం సమకూర్చడంతో పాటు వీరవరం వైపు వెళ్లే ప్రధాన రహదారికి స్థలం కూడా దానం చేసిన బొమ్మిరెడ్డి వారి పేరు హైస్కూల్లో ఒక భవనానికి పెట్టాలని సభలో వక్తలు కోరారు. అడపా సుబ్రహ్మణ్యం, ఉంగరాల వీరభద్రరావు, ఆకుల సూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయులు కుమ్మరపూడి రవిబాబు, కె.దొరబాబు, కొత్తూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక విజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా టైలర్స్ సంఘం నాయకుడు బడిగంటి సూర్యనారాయణ, రైతు నాయకులు బొమ్మిరెడ్డి వెంకట్రావు, బొమ్మిరెడ్డి కృష్ణమూర్తి, బొమ్మిరెడ్డి రమేష్, బొమ్మిరెడ్డి తమ్మయ్య, బొమ్మిరెడ్డి బుజ్జి య్య, బొమ్మిరెడ్డి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు



గోకవరం-జగ్గంపేట ప్రధాన రహదారిలో కమ్ముకున్న పొగమంచు

వేసవి కాలంలో సైతం పొగమంచు వీడటంలేదు. ఉదయం పొగమంచు కమ్ముకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గోకవరం మండలం సింగారమ్మచింత మొదలుకొని జగ్గంపేట మండలం మల్లిసాల వరకు ఆదివారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ముకుంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఈ పొగమంచు కమ్ముకుంది. గోకవరం

భజేహం... భక్తాంజనేయం

అనపర్తి: హనుమజ్జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కెనాల్ రోడ్డు టాక్సీ స్టాండ్ వద్ద, జీబీఆర్ కళాశాల సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారిని తమలపాకులతో అలంకరించి విశేష పూజలు జరిపారు. మండలంలోని రామవరం, కుతుకులూరుల్లోని భక్తాంజనేయస్వామి ఆలయాల్లో జరిగిన పంచామృతాభిషేక పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. రామవరం, కుతుకులూరుల్లోని ఆలయాల్లో జరిగిన పూజల్లో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసిసురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి: సంపర గ్రామంలోని పంట కాలువ వద్ద గల 27 అడుగుల అభయాంజనేయస్వామి వారికి అర్చకులు ఖండవిల్లి హనుమంతాచార్యులు విశేష పూజలు జరిపారు. తమలపాకులు, గంగ సింధూరార్చన, కలశ ప్రతిష్ఠ, పంచామృతం, క్షీర, జలాభిషేకాలు నిర్వహించారు. భజన భక్తి బృందం భక్తి గీతాలు ఆలపించారు.

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడిలో భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారధన చేశారు. పందలపాకలోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రంగంపేట: హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని చండ్రేడు, రంగంపేట, జి.దొంతమూరు, వడిశలేరు గ్రామాల్లోని ఆంజనేయుని విగ్రహాలను విశేషంగా అలంకరించి తమలపాకులు, సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి

గోకవరం: హనుమజ్జయంతిని గోకవరం మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గోకవరం శివారున కొత్తపల్లికి వెళ్లే మార్గంలోని వరబాపనమ్మ ఆలయ సమీపంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. వేదపండితులు ద్విభాష్యం సూర్యవెంకట సుబ్బారావుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గోకవరంలో స్థానిక మెయిన్‌రోడ్డులోని దాసాంజనేయస్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మురళీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తంటికొండలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న ఆంజనేయస్వామి ఆలయంలో ఈఓ ఆర్‌వీ చందన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుతుకులూరులో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు



కోరుకొండలో శోభాయాత్రను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

వైభవంగా శోభాయాత్ర

రాజానగరం: హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. రాజానగరం, సూర్యారావుపేట, పుణ్యక్షేత్రం, నరేంద్రపురం, వెలుగుబంద, చక్రద్వారబంధం, కానవరం, తోకాడ, పల్లకడియం, తూర్పుగానుగూడెం, పాలచర్ల గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఉన్న అభయ ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల సెంటర్ వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హోమాలు జరిగాయి. పలుచోట్ల అన్నసమారాధనలు చేశారు. రాజానగరంలో శోభాయాత్ర (బైకు ర్యాలీ) నిర్వహించారు.

మధురపూడి: కోరుకొండ దేవుని కోనేరు వద్ద శోభాయాత్రను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ప్రారంభించారు. బూరుగుపూడి జంక్షన్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నసమారాధన జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు కాళ్ల వీరబాబు, నేతుల చిన్ని, బొరుసు బద్రి, పసుపులేటి బుల్లియ్యనాయుడు, బొండాడ చందు, బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్నచౌదరి, కామిశెట్టి దొర పాల్గొన్నారు.

సీతానగరం: చినకొండేపూడి నాలుగు బొమ్మల సెంటర్‌లోని అభయాంజనేయాస్వామికి వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్‌ఐసీ రాజు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. దాత దండు వెంకటలక్ష్మి రూ.23 వేలతో స్వామివారికి మకర తోరణం అందించారన్నారు.



సంపర అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పందలపాకలో ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి

ఒనువులమ్మ జాతర మహోత్సవాలు



జాతరలో గరగ నృత్యాల సందడి

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో ఒనువులమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పుట్టింటి వారైన మల్లిన కుటుంబ సభ్యులు, అత్తింటి వారైన పాలడుగుల కుటుంబ సభ్యుల పూజలతో కార్యక్రమాలు మొదలయ్యాయి. ఉదయం గరగలు, వరంగల్ డప్పులు, తీన్మార్ వాయిద్యాలతో గ్రామంలో అమ్మవారి చల్లఘటం ఊరేగింపు జరిగింది. సాయంత్రం పునే డ్రమ్స్, ఫోక్ డ్యాన్స్, కేరళ వాయిద్యాలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పదేళ్ల బాలుడు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. దేవీపట్నం మండలం రావిలంకకు చెందిన శివన్న దొర, అతడి తమ్ముడి కుమారుడైన అభిరామ్‌ను బైకుపై ఎక్కించుకుని రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరూ కిందకు పడిపోగా, అభిరామ్ తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శివన్నదొరను రాజమహేంద్రవరం తరలించారు. బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్

ప్రారంభించిన ఎంపీ భరత్‌రామ్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం వివిధ రకాల చేపలను తిలకిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: వేసవి సెలవులలో నగరవాసులకు ఆహ్లాదకరమైన, అబ్బురపరిచే విధంగా చిన్నపెద్ద 42 రకాల ఎమ్యూజ్‌మెంట్స్‌తో అండర్ వాటర్ ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను రాజమహేంద్రవరం నగరం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ ఎగ్జిబిషన్ ను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా ఈ అండర్ వాటర్ షిప్ టన్నల్‌ను భువనేశ్వరీ ట్రేడ్‌ఫైర్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిందన్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆనందం కలిగించేలా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారని, అలాగే వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ రకరకాల స్టాల్స్ ఏర్పాటు చేశారన్నారు.

ఎగ్జిబిషన్‌లో రూ.6 లక్షల విలువైన చేపలు

మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అండర్ వాటర్ షిప్ టన్నల్‌లో చాలా అరుదైన, ఖరీదైన చేపలు చూడవచ్చునని ఎగ్జిబిషన్ ఆర్గనైజర్లు శ్రీనివాస్, గోపీనాథ్ తెలిపారు. రూ.500 నుంచి రూ.6 లక్షలు విలువైన రకరకాల చేపలు ఉన్నాయన్నారు. రెండు నెలల పాటు, రూ.2 కోట్లు వెచ్చించి 200 మంది కార్మికులు ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కష్టపడ్డారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, మార్గాని సురేష్, కడియాల లక్ష్మణరావు, ఎస్వీ శ్రీనివాస్, కాంతారామ్ పాటిల్, రేలంగి వీర వెంకట సత్యనారాయణ, కొండేటి భీమారావు పాల్గొన్నారు.

నిరంతర యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కర్రి రామారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: నిరంతర యోగా సాధన చేయడం ద్వారా అనేక రుగ్మతలకు పరిష్కారం లభిస్తుందని ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రణవ సంకల్పయోగా సమితి యోగా శిక్షకుడు శ్రీనివాస్.. స్థానిక డీఎంహెచ్ స్కూల్ ఆవరణలో 15 రోజుల పాటు నిర్వహించిన వేసవి ఉచిత యోగా శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రామారెడ్డి మాట్లాడుతూ నిత్యం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు మున్సిపల్ కమిషనర్ జితేంద్ర, వికాస తరంగిణి సమన్వయకర్త పద్మావతి రామానుజన్, మాజీ కార్పొరేటర్ డాక్టర్ అనసూరి పద్మ లత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.